కస్తూర్బాలో సమస్యల తిష్ట

- మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు
- ప్రహరీ లేక విషపురుగుల సంచారం
- భయాందోళనలో విద్యార్థినులు, సిబ్బంది



కస్తూర్బా పాఠశాల

తాడిపత్రిటౌన్: కస్తూర్బా పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. తాడిపత్రి పట్టణానికి దూరంగా పెన్నానది ఒడ్డున ఉన్న పాఠశాలకు కనీసం ప్రహరీ లేకపోవడంతో రాత్రి అయితే చాలు భయం భయంగా ఉండాల్సి వస్తోందని విద్యార్థినులు, సిబ్బంది వాపోతున్నారు. పాఠశాలలో దాదాపు 260 మంది విద్యార్థినులున్నారు. నివాసాలకు దూరంగా ఉండటంతో పాఠశాల చుట్టూ పెద్ద ఎత్తున ముళ్లపొదలు అలుముకున్నాయి. దీంతో తరచూ పాఠశాలలోకి విషపురుగులు వస్తున్నాయని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలకు ప్రహరీతో పాటు గేటు లేకపోవడంతో ఎవ్వరుబడితే వారు పాఠశాల ఆవరణలో తచ్చాడుతూ కనిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద చేపట్టిన పనులు మధ్యలోనే ఆగిపోవడంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. నిర్మాణాలు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు. అలాగే మరుగుదొడ్లకు తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి కస్తూరిబా పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎస్‌ఓ పద్మావతిని కోరగా ఇటీవల పాఠశాలకు కొత్త మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికైందన్నారు. ఆ కమిటీ నిర్ణయాల మేరకు త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు.


పాఠశాలకు ప్రహరీ లేని దృశ్యం

ప్రహరీ లేక ఇబ్బంది



పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి అయితే గుర్తుతెలియన వ్యక్తులు తచ్చాడుతూ కనిపిస్తున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో విషపురుగులు సంచారం ఎక్కువగా ఉంది. అధికారులు వెంటనే పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టి గేటు అమర్చాలి. – సాయిహారిక, 10వ తరగతి

మరుగుదొడ్లకు తలుపులు లేవు



పాఠశాల ఆవరణలో ఉన్న మరుగుదొడ్లకు తలుపులు లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్లకు వెళ్లలేక పోతున్నాం. చాలా సమస్యగా వుంది. వెంటనే అధికారులు స్పందించి మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయడంతోపాటు మట్మతులు చేపట్టాలి. – శ్రావణి, 7వ తరగతి

గుంతకల్లులో భారీ వర్షం


మరువ పారుతున్న నాగసముద్రం చెరువు


రాకపోకలు స్తంభించిన నాగసముద్రం రోడ్డు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ భారీ వర్షం కురిసింది. దాదాపు నాలుగు గంటల పాటు కురిసిన వానకు 46.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వరుసగా రెండు రోజులు భారీ వర్షం పడటంతో మండలంలోని నాగసముద్రం చెరువు మరువ పారింది. చెరువు నుంచి భారీ ఎత్తున వర్షపు నీరు భయటకు వస్తుండటంతో నాగసముద్రం రహదారి పూర్తిగా నీటితో మునిగిపోయింది. దీంతో గుంతకల్లు, నాగసముద్రం, పామిడి గ్రామాలను కలిపే రహదారిలో ఆదివారం ఉదయం దాదాపు మూడు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షం కారణంగా మండలంలో నాగసముద్రం, కదిరిపల్లి, గుర్రబ్బాడు తదితర గ్రామాల్లో 75 ఎకరాల్లో వేరుశనగ, 45 ఎకరాల్లో మొక్కజొన్న, 150 ఎకరాల్లో కందిపంటలు నీట మునిగినట్లు ఏఓ స్వాతి తెలిపారు.


నేలకొరిగిన మొక్కజొన్న పంట

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పామిడిలో శనివారం రాత్రంతా ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షానికి వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల నడుమ వర్షపునీటి నిల్వలు మడుగులను తలపించాయి. అలాగే రోడ్లపై గుంతలు వర్షపు నీటితో నిండడంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు: యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని గార్లదిన్నె తహసీల్దార్ ఈరమ్మ, ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప, నాయకులు చామలూరు రాజగోపాల్, నగేష్, సాకే గోవింద్ సూచించారు. ఆదివారం మండలంలోని మిడుతూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ అంటరానితనాన్ని రూపుమాపడం కోసం ఆయన కృషి మరువలేనిదన్నారు. యువత అంబేడ్కర్ ఆశయాలను సాధించడం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గద్దెల నాగభూషణం, చిన్న ఆంజనేయులు, దిమ్మగుడి రామాంజనేయులు, కొండయ్య, భూపతి, జైభీమ్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

23న డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా


మాట్లాడుతున్న శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: స్థానిక మస్తాన్‌పేట నుంచి పోర్టర్స్ లైన్ వరకూ ఉన్న రైల్వే క్వార్టర్స్‌లోకి ప్రవేశించకుండా మూసేసిన అడ్డదారులను తెరిపించడంలో రైల్వే అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 23న డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వేక్వార్టర్స్ మీదుగా రోజూ వందలాది మంది పిల్లలు స్కూళ్లకు సులువుగా వెళ్లేవారన్నారు. అడ్డదారులను మూసేయడంతో స్కూళ్లు, రైల్వేస్టేషన్, రైల్వే ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రజలు కిలోమీటర్ మేర చుట్టేసుకుని పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల ఇబ్బందులను గమనించి మూసేసిన అడ్డదారులను తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం ఈనెల 20 నుంచి 22 వరకు సంతకాల సేకరణ చేపడతామన్నారు. 23న డీఆర్ఎం కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, నాగరాజు, రంగమ్మ, షబ్బీర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలను జయప్రదం చేయండి


భగవద్గీత పోటీల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద ఈ నెల 28, 29 తేదీల్లో త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పామిడి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే భగవద్గీత పోటీలకు సంబంధించి పట్టణ ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలకు ఆదివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 5 వరకూ 11 రోజుల పాటు స్థానిక కొత్త బస్టాండ్ వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు 6, 7, 8 తరగతుల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీ ఉంటుందన్నారు. 29వ తేదీ సాయంత్రం 9, 10 తరగతి విద్యార్థులకు పోటీలుంటాయన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సూర్యనారాయణ, శివారెడ్డి, చంద్రశేఖర్, నారపరెడ్డి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ముతవల్లీల ఎంపికకు సహకరించాలి


మాట్లాడుతున్న షకీల్ షఫీ

పామిడి: ప్రజాప్రతినిధుల సహకారంతో మసీదుల్లో ముతువల్లిల ఎంపిక ప్రక్రియను సామరస్యంగా నిర్వర్తించుకునేందుకు ముస్లిలు సహకరించాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ముతువల్లిల అసోసియేషన్ అధ్యక్షుడు కేఎం షకీల్‌షఫీ కోరారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో నిర్వహించిన ముస్లింల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. మతపరమైన ఈ విషయాన్ని వక్ఫ్‌బోర్డు కమిటీ అధ్యక్షుల దృష్టికి తెచ్చి పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ముతువల్లిల ఎంపిక ప్రక్రియపై ఆయన జమాత్‌తో సమీక్షించారు. వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు బీకే అన్వర్‌బాషా, ఆయూబ్, ముతువలి బీకే రహీమ్, జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంటింటి సర్వే

శింగనమల: ఓటరు నమోదులో భాగంగా ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 20 వరకూ బీఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు 1లోగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. అదేవిధంగా అభ్యంతరాలుంటే ఫారం-7, పోలింగ్ కేంద్రం మార్పునకు ఫారం-8 సమర్పించాలన్నారు.

వ్యక్తికి గాయాలు

పుట్లూరు: మండలంలోని ఎ.కొండాపురం వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొనడంతో ఓ వ్యక్తికి గాయాలైనట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. పెద్దపప్పూరు మండలం వరదాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరి, రమేష్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కొండాపురం సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ వద్ద లారీ ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఘటనలో గాయపడిన రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో నుంచి జారిపడి..

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోలో నుంచి జారి పడి మధుసూదన్ ఆచారి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గార్లదిన్నెకు చెందిన ఆయన గుత్తికి పని మీద వచ్చాడు. పని పూర్తయిన అనంతరం ఆటోలో వెనుకకూర్చొని గార్లదిన్నెకు బయలుదేరాడు. అయితే స్పీడ్ బ్రేకర్ వద్ద వద్ద ఆటో కుదుపునకు గురవడంతో మధుసూదన్‌ఆచారి జారి కింద పడ్డాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నాటుసారా పట్టివేత

పెద్దపప్పూరు: మండలంలోని గార్లదిన్నెలో నాటుసారా ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం రాత్రి ఇన్‌చార్జి ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప, ఏఎస్‌ఐ హమానుల్లా, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపాలురెడ్డి, వరాలమ్మ నుంచి 72 నాటుసారా ప్యాకెట్లును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. అనంతరం ఉరవకొండ కోర్టులో హాజరుపరచగా నిందితులకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేస్తే ఉద్యమిస్తాం


ముకుందాపురంలో మాట్లాడుతున్న రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్ రెడ్డి

గార్లదిన్నె: రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డి, బీసీ కులాలపై అనవసరంగా ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి ఇబ్బందులు చేస్తే ఉద్యమం చేపడుతామని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ముకుందాపురంలో పర్యటించి రైతు సూర్యచంద్రరెడ్డికి చెందిన పొలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముకుందాపురంలో రైతు సూర్యచంద్రరెడ్డికి చెందిన పొలంలోకి అదే గ్రామానికి చెందిన కొంతమంది దళితులు వెళ్లి ×ఆ భూమి మాదిÇ అని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. భూతగాదా విషయంలో పోలీసులు సూర్యచంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. అనవసరంగా ఎస్సీ, ఎస్టీ కేసులు పెడితే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం సూర్యచంద్రరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు రవీంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మట్టిని ఆటోలో తెచ్చి గుంతలు పూడుస్తున్న ఆటో డ్రైవర్లు


రోడ్డుపై ఏర్పడిన గుంతలు పూడుస్తున్న దృశ్యం


రోడ్డుపై గుంతల్లో మట్టి వేసిన దృశ్యం

శభాష్.. ఆటో డ్రైవర్లు!

గుత్తి: శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేసిన ఆటో డ్రైవర్లు శెభాష్ అనిపించుకున్నారు. వివరాలు.. గుత్తి నుంచి ఆర్ఎస్‌కు వెళ్లే రహదారిపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు విన్నవించినా మున్సిపల్, పంచాయతీ రాజ్ అధికారులు రోడ్డు మరమ్మతులకు ముందుకు రాలేదు. దీంతో ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి శ్రమదానంతో ఆదివారం గుత్తి నుంచి ఆర్ఎస్‌కు పలు చోట్ల ఏర్పడిన గుంతలను పూడ్చి వేశారు. ఆటో డ్రైవర్లు నజీర్, అమరేశ్వర్, మహ్మద్ రసూల్, సురేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, కర్ణ, తదితరులు ఐదు ఆటోల్లో మట్టిని తెచ్చి గుంతలను పూడ్చి వేశారు. శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు చేయడంతో ప్రజలందరూ ఆటోడ్రైవర్లను అభినందించారు.

క్లుప్తంగా

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి


సుభాష్ చంద్రబోస్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, సీపీఐ, మాదిగ దండోరా ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ, సీపీఐ నాయకులు తలారి రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, నారాయణ రెడ్డి, వడ్డే రామాంజనేయులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం– తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అనంతరం పలువురికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం


మనోహర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ ఇటీవల బీజేపీలో చేరిన మనోహర్‌ను భారతీయ జనతాపార్టీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు యువమోర్చా జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ తెలిపారు. ఆదివారం ఇల్లూరు లక్ష్మీ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి కేశవ, పట్టణ అధ్యక్షుడు కరాటే రవి, ఉపాధ్యక్షుడు రవీంద్ర, కార్యదర్శి లింగేశ్వర్, చక్రధర్, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న కులసంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బండారు క్రిష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో పలు కుల సంఘాల నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందువులంతా జాగృతమై ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్, కుల సంఘాల ప్రతినిధులు పురంధర్, జగదీష్ శారదా, దుర్గారామ్, రామాంజనేయులు, విజయలక్ష్మి, కేశవ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధనోత్సవంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, అబ్రహాం, బుజ్జిబాబు, రాజు, ప్రసాద్, పాస్టరమ్మ సువర్ణమ్మ, ప్రిస్కిల్లా, డాక్టర్ కమల, రేచెల్, మెర్సీ, ప్రశాంతి, లత, రమాదేవి, జ్యోతి, రజని తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

గుత్తి: పట్టణంలోని కొత్తూరులో ఉన్న అనాథాశ్రమంలో ఆదివారం చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్ రాయల్, రామ్ చరణ్ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ గడ్డ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరామాలయంలో పూజలు


పూజలు నిర్వహిస్తున్న ట్రైనీ కలెక్టర్ వినూత్న

శింగనమల: మండల కేంద్రంలోని ఆత్మరామాలయాన్ని ట్రైనీ కలెక్టర్ వినూత్న ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆమెకు అర్చకులు, రెవెన్యూ అధికారులు స్వాగతం పలికారు. ఆత్మ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరిత్ర గురించి అర్చకులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, వీఆర్వో తాతయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


అలంకరణలో స్వామి బృందావనం (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయం పక్కన నిర్మించిన రాఘవేంద్రస్వామి ఆలయంలో సోమవారం నుంచి 347వ ఆరాధనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 7 గంటలకు ప్రార్థనోత్సవం నిర్వహించి ధ్వజారోహణంతో శాస్త్రోక్తంగా ప్రారంభిస్తారు. మంగళవారం పూర్వారాధన, బుధవారం మధ్యారాధన, గురువారం ఉత్తరారాధన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యారాధన సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, పాదపూజ, కనక మహాపూజ, తులసీ అర్చన, మహామంగళారతితో పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ తెలిపారు. భక్తులు ఆరాధనోత్సవాల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.

అమ్మవారిశాలల్లో ప్రత్యేక పూజలు


అలంకరణలో ముసలమ్మ అమ్మవారు

బుక్కరాయసముద్రం: అమ్మవారి ఆలయాల్లో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయం, ముసలమ్మ కట్టవద్ద వెలసిన ముసలమ్మ ఆలయం, కాశీ విశాలాక్షి ఆలయంలో భక్తులు ఉదయాన్నే అభిషేకాలు, కుంకుమ అర్చనలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు.

బంగారు నగల వితరణ


కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బంగారు మాంగల్యాలు వితరణ చేస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం అనంతపురానికి చెందిన లావణ్య, సుధాకర్ బాబు దంపతులు రూ.59, 000 విలువ చేసే 8 గ్రాముల బంగారు మాంగల్యాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు రామాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గార్లదిన్నె: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి మండల స్థాయి ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అలాగే ప్రజ లు నుంచి వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులుకు అందజేసి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.